


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శనివారం 22 నవంబర్ 2025 పేజీలు 09


# పల్లెల్లో మళ్లీ సందడి




## స్థానిక ఎన్నికలకు సర్కార్ సన్నాహాలు..








- మొదట పంచాయతీ
- ఆ తర్వాతే ప్రాదేశికం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు
- పార్టీ పరంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్
- ఇద్దరు కు మించి పిల్లలున్న పోటీకి అర్హులే
- రెండు విడతల్లో జరగనున్న ఎలక్షన్స్
- అధికార యంత్రాంగం సన్నద్ధం
- డిసెంబరు రెండో వారంలో షెడ్యూల్ విడుదలకు అవకాశం

3లో

---

తెలంగాణ రైతు సంక్షేమానికి

## ప్రభుత్వం కృషి చేస్తుంది

- ప్రతిరోజూ 4 నుండి 5 క్వింటాళ్ల పత్తి కొనుగోలు
- రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు
- రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సి సి ఐ కొనుగోలు కేంద్రాలు
- నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలి
- పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ

2లో



## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను అందించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సబ్ ఇన్స్పెక్టర్లతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ( మిగితా...2లో )




---

పిల్లల హక్కుల విషయంలో

## ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

### - రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి



**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

పిల్లల రక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల బాలల భద్రత, బాల్య వివాహాల నియంత్రణ, పాక్సో చట్టం అమలు, చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థపై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పిల్లలకు రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవంతో జీవించే హక్కులు ఉన్నాయని, ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజం మొత్తం పాలుపంచుకోవాల్సిన బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు నమోదవడం ఆందోళనకరమని పేర్కొన్న ఆమె, సమాచారం వచ్చిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని, బాల్య వివాహ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. అలాగే హాస్టళ్లు, ఆశ్రమాలు, పాఠశాలల్లో పిల్లలపై వేధింపులు, దుర్వినియోగం, నిర్లక్ష్యంపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో పిల్లలు సైబర్ మోసాలు, అనారోగ్యకర ఆన్‌లైన్ గేమ్స్ ప్రభావానికి గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆన్‌లైన్ ప్రవర్తనను గమనించాలని, వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై అవగాహన తప్పనిసరి అని సూచించారు. బాలల అత్యవసర సమస్యల పరిష్కారానికి చైల్డ్‌లైన్ 1098 సేవలనుప్రజలు విస్తృతంగా ( మిగితా...2లో )

వైద్య విద్యార్థులు చదువుకునేందుకు

## అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

### - పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ

2లో



సూర్య www.suryaa.com
శనివారం 22 నవంబర్ 2025

# తెలంగాణ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది



**లక్షెట్టిపేట, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :** తెలంగాణ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా కృషి చేస్తుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని వెంకటేశ్వర కాటన్ మిల్లు లో సి సి ఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎకరానికి 14 నుండి 16 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వ నిబంధనలలో పేర్కొన్న 7 క్వింటాళ్ల అంశాన్ని సడలించి రైతులు ముందుగా నమోదు చేసుకున్న ప్రకారంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సి.ఎం.డి. తో మాట్లాడి ఎల్ 1, ఎల్2, ఎల్3 అంశాలకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో కేటాయించిన 10 కొనుగోలు కేంద్రాలలో 6 కేంద్రాలు ప్రారంభించబడి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతిరోజు 4 నుండి 5 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సి సి ఐ కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ సంవత్సరం క్వింటాల్ పత్తికి 8 వేల 110 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా అవాస్తవ ప్రచారాన్ని మానుకొని రైతు సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా 7 క్వింటాళ్ల అంశాన్ని పరిశీలించి రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసి ధ్రువీకరించుకోవాలని, పంట ఉత్పత్తి ఆధారంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి ప్రాంతాలలో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ ప్రాంతంలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు లబ్ధి చేకూరేలా పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందని, కౌలు రైతులు తమ పట్టాదారుల సమన్వయంతో వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ధృవపత్రాలు జారీ చేసే సమయంలో అధికారులు జాగ్రత్త వహించాలని, వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే టి ఆర్ జారీచేసి పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కొనుగోలు కేంద్రాలకు నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం ఎంపీ అనుచరుడు దమ్మ సునీల్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు.అంతకుముందు హన్మంతు పల్లి, చందారం కు బస్ సౌకర్యం కల్పించడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకుడు మల్లేష్ కలెక్టర్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల కిషన్ గౌడ్,మల్లేష్, దొంత నర్సయ్య,మినుముల శాంతి కుమార్, నారాయణ, కొనుగోలు కేంద్రం నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.


## గృహ నిర్మాణాలకు పర్మిట్ కర్ర ను వాడాలి - బి.ప్రవీణ్ నాయక్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్



**కాసిపేట, నవంబర్ 21,సూర్య మేజర్ న్యూస్ :** గృహ నిర్మాణాలకు, ఫర్నిచర్ సంబంధిత వస్తువులకు పర్మిట్ కర్రను వాడాలని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ తెలిపారు.ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని ముత్యంపల్లి కాసిపేట, గ్రామాలలో శుక్రవారం నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి వాటికి వాడిన కర్ర యొక్క పర్మిట్ వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా వడ్రంగులకు ,ఇంటి యజమానులకు పర్మిట్ ఉన్న కర్రనే వాడాలని అక్రమ కలపను వాడరాదని సూచించారు. ఇంటి పరిసరాలలో పెంచుకున్న చెట్లు ఇంటి అవసరాల నిమిత్తం చెట్లను తీసివేయాలి అనుకునేవారు ఏలాంటి అనుమతి లేకుండా నరకరాదని వాల్టా చట్టం ప్రకారం ఆన్లైన్ నందు అప్లై చేసి తదుపరి అనుమతి వచ్చాక చెట్లను తొలగించాలని లేనిచో అక్రమంగా నరికిన చెట్లకు వాల్టా చట్టం ప్రకారం జరిమానా విందించబడునని తెలియజేశారు. అవసర నిమిత్తం చెట్లను తొలగించేవారు అటవి శాఖ అధికారులకు ముందే తెలియజేయాలని కోరారు. ఆయన వెంట ఎఫ్ బి ఓ శ్రీధర్, వాచర్ లక్ష్మణులు ఉన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను అందించాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్, సభ్యుల ఎన్నికల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను 3 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గొడవలు జరిగిన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ సంతకాలతో అందించాలని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, డెడికేషన్ కమిషన్ కేటాయించిన ప్రకారం సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీలోగా ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాలని, 23వ తేదీన తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించాలని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల కార్యచరణ ఖరారు అయిన రోజు నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులు చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

## - పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులు చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నిష్ణాతులైన అధ్యాపకుల ద్వారా విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల అవసరం మేరకు ఎం.పి. ల్యాడ్స్ నిధుల నుండి బస్సు సర్వీసు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు క్రీడలకు సంబంధించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో ఇష్టపడి చదివి మంచిర్యాల జిల్లా పేరును రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో వినిపించాలని తెలిపారు. తన తండ్రి, అక్క కూడా వైద్య విద్య అభ్యసించారని, విద్యార్థులు వైద్య రంగాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని తెలిపారు. వైద్య విద్య పూర్తి చేసుకుని సమాజంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇటీవల కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి జల సంరక్షణ పురస్కారాలలో మంచిర్యాల జిల్లాలో జాతీయస్థాయిలో నిలబెట్టి జిల్లా కలెక్టర్ అవార్డు తీసుకోవడం అభినందనీయమని, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఏకాగ్రతతో చదివి మంచిర్యాల జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలపాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడం జరిగిందని తెలిపారు. 32 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 250 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టడం జరిగిందని, వైద్య కళాశాలకు అనుబంధంగా చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు 2 నెలలలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# పిల్లల హక్కుల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి - రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి



మొదటి పేజీ తరువాయి...

వినియోగించుకోవాలని కోరారు. పాక్సో చట్టం అమలు, బాల కార్మిక నిర్మూలన, సీపీస్ బలోపేతంపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో చిన్నారుల రక్షణకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్టుగా తెలిపారు.ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 354 మంది చిన్నారులను గుర్తించి, డ్రాప్అవుట్ పిల్లలను బడిలో చేర్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. షీ టీమ్, భరోసా సెంటర్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా కళాజాత బృందాల సహాయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణ కోసం పటిష్ట చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 83 పాక్సో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. బడిబాట ప్రోగ్రాం కింద కెజీబీవీలు, పాఠశాలలు, భవిత కేంద్రాల్లో మరుగుదొడ్లు, భవనాలు, పెయింటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని, వైద్య సేవల నాణ్యతను మరింత పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. విద్య, ఆరోగ్య విభాగాల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో 31 సెక్టర్లలో 931 అంగన్వాడీలు, 0–6 ఏళ్ల పిల్లలకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 57 కేసులు నమోదు చేసి విచారణ జరిపామని తెలిపారు. డ్రాప్అవుట్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం జరిగిందని అన్నారు. 2023 నుంచి ఇప్పటివరకు 44 బాల్య వివాహ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.120 పాక్సో కేసుల్లో పరిహారం అందించడం జరిగిందని అన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కళాజాత బృందాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నవారిపై కేసులు నమోదు చేశామని, రక్షిత వాతావరణం కల్పించి బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించామన్నారు. గ్రామాల్లో బాల్య వివాహ నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి, బాల్య వివాహాల పరిణామాలపై వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో బలశక్తి, అమ్మ రక్షిత కార్యక్రమాల పురోగతిని వివరించారు. అనంతరం కమిషన్ చైర్ పర్సన్, సభ్యులను శాలువా, జ్ఞాపికలతో కలెక్టర్ సత్కరించారు.అంతకుముందు పట్టణ కేజీబీవి, రిక్షా కాలనీ లోని అంగన్వాడీ కేంద్రాన్ని బాలల కమిషన్ బృందం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వందన గౌడ్, అపర్ణ, సరిత, ప్రేమలత, వచన్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్ ఏఎస్పీ లు సురేందర్ రావు, అవినాష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డిఎమ్ అండ్ ఎచ్,ఓ రాథోడ్ నరేందర్, నిర్మల్ డిఇఓ బోజన్న, ప్రోగ్రాం కోర్డినేటర్ డా.సౌమ్య, విద్యా, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీస్, శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో మళ్ళీ సందడి .. స్థానిక ఎన్నికలకు సర్కార్ సన్నాహాలు

**- మొదట పంచాయతీ - ఆ తర్వాతే ప్రాదేశికం- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు- పార్టీ పరంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్- ఇద్దరు కు మించి పిల్లలున్న పోటీకి అర్హులే - రెండు విడతల్లో జరగనున్న ఎలక్షన్స్- అధికార యంత్రాగం సన్నద్ధం- డిసెంబరు రెండో వారంలో షెడ్యూల్ విడుదలకు అవకాశం**

**లక్షెట్టిపేట, నవంబర్ 21, సూర్య ప్రత్యేక కథనం :** త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పల్లెల్లో మళ్లీ రాజకీయ సందడి మొదలైంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు, సుప్రీం కోర్టు తప్పు పట్టిన సంగతి తెలిసిందే. దీంతో మళ్లీ పాత రిజర్వేషన్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. సోమవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత పంచాయతీ, తరువాత పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించ కుండా పాత విధానంలోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే పంచాయతీ ఎన్ని కలను ముందుగా నిర్వహిస్తుండటంతో ఇటీవల సర్పంచ్, వార్డులకు ప్రకటించిన రిజర్వేషన్లన్నీ మళ్లీ మారనున్నాయి. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నిక లపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

సుప్రీం కోర్టు సూచనల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పాత విధానంలోనే మళ్లీ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాల్సి రావడం కాంగ్రెస్ సర్కార్కు కొంత ఇరకాటంగానే మారింది. దీన్ని అధిగ మించేందుకు పార్టీలతో సంబంధం లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. ఇదిలా ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ప్రాదేశిక ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్లయించింది. కానీ న్యాయస్థానాల్లో వ్యతిరేకంగా తీర్పులు రావడంతో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పార్టీ యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందుగా ప్రభుత్వం తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు రెండు సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో డిసెంబర్ 9న ప్రజాపాలన సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వం రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం ప్రారంభించడంతో మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల చర్చ మొదలైంది. క్యాబినేట్ నిర్ణయాల తరువాత డిసెంబర్ మొదటి వారం గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం వ్యూహరచన చేస్తున్నట్లు భావిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలపై 42 శాతం బీసీ రిజర్వేషన్ పార్టీ తరఫున అమలు చేయాలనే నిర్ణయం గ్రామాల్లో మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. లక్షెట్టిపేట మండల పరిధిలోని మొత్తం 18 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే రాజకీయ చర్చలతో "నువ్వా నేనా" అంటూ అన్ని పార్టీల నాయకులు పోటీకి పలువురు ఆశావహులు తెరపైకి వస్తున్నారు. లక్షెట్టిపేట మండలం, మంచిర్యాల జిల్లా కేంద్రానికి అతిదగ్గరగా ఉండటం వల్ల భవిష్యత్లో లక్షెట్టిపేట ముఖ్య అభివృద్ధి కేంద్రంగా ఎదుగుతుందనే అభిప్రాయం గ్రామస్తుల్లో, నాయకుల్లో పెరుగుతోంది. ఈ పరిణామాల మధ్య గ్రామాల్లో సర్పంచ్ పదవుల కోసం భారీ పోటీ పోటీ కనిపిస్తోంది. ఆశావాహులు మళ్లీ ఇంటింటికి తిరుగుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతుండడంతో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మండలంలోని ప్రతి గ్రామంలో కనిపిస్తోంది.



## పథకాలపై విస్తృత ప్రచారం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు ఒకటి నుంచి 3వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు ఆకర్షించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ను సైతం పెద్ద ఎత్తున నిర్వహి స్తోంది. వీటిపై ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహి స్తోంది. ఈ కార్యక్రమాల తరువాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ విడుదల లోపుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని పార్టీ స్థానిక నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

## అధికార యంత్రాగం సన్నద్ధం

స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావడంతో జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఇటీవలే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడు దలై నామినేషన్ల పక్రియ మొదలైన తరువాత న్యాయ స్థానం ఆదేశాలతో ఈ పక్రియ అర్ధంతరంగా ఆగిపో యిన విషయం తెలిసిందే. అయితే ఇపుడు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని నిర్ణ యించడంతో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికా రులు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిం చినా నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు అదికారులు తెలిపారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ వార్డుల పునర్విభజనచేసి ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. రిటర్నింగ్ అధికారులతో పాటు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల నియామకం జరిగింది. బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయి. బ్యాలెట్ పత్రాలకు సంబంధించి సర్పంచులకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుగు రంగులో ముద్రించనున్నారు.

## పంచాయతీ పాలన అస్తవ్యస్తం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవ డంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచి పోయి గ్రామీణ ప్రాంతాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. 2024, ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల పాలన ముగియగా, అదే ఏడాది జూలై నెలలో మండల పరిషత్తులు, జెడ్పీ పాలక వర్గం గడువు సైతం ముగిసిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీలు, జెడ్పీ, మండల పరిషత్తులలో ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి పాలన దుర్భరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల విషయం ఎలా ఉన్నా ప్రజలకు కనీస సదుపాయాలను కూడా కల్పించలేకపోతున్నారు. ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతోనే పంచాయతీల్లో కార్మికుల వేతనాలు, అత్యవసర పనులు చేపడుతుండటం గమనార్హం.

# క్వాలిటీలో సింగరేణిలోనే మేటి "శ్రీరాంపూర్"

**శ్రీరాంపూర్, నవంబర్ 27, సూర్య మెజార్ న్యూస్:** సింగరేణిలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్ వివిద రంగాల్లో సంస్థలోనే నెంబర్ వన్గా నిలుస్తోంది. సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒక్కటైన నాణ్యత విషయంలోనూ శ్రీరాంపూర్ ఏరియా తనదైన ముద్ర వేస్తోంది. 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి గాను 75 శాతంతో క్వాలిటీలో ప్రథమ స్థానంలో నిలిచి ఈ ఏడాది క్వాలిటీ వారోత్సవాల ముగింపు సందర్భంగా సంస్థ సీఎండీ చేతుల మీదుగా షీల్డ్ను శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ క్వాలిటీ ఇన్చార్జ్ మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి స్వీకరించారు. బొగ్గు ఉత్పత్తి సంస్థగా పురుడు పోసుకొని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రంగాలవైపు అడుగులు వేస్తూనే సంస్థ ప్రధాన వ్యాపారం అయిన బొగ్గు ఉత్పత్తిలో కూడా ప్రత్యేక దృష్టిసారించింది సింగరేణి. ప్రైవేట్ సంస్థలు, విదేశాల నుంచి వస్తున్న పోటీని తట్టుకొని ఉన్న వినియోగదారులను కాపాడుకోవటం, కొత్త వినియోగదారులను ఆకర్షించటం ఒక్క నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారానే సాధ్యమని గుర్తించింది. అందుకు అనుగుణంగానే నాణ్యత పెంపు లక్ష్యంగా ప్రతీ ఏటా బొగ్గు నాణ్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఒప్పందానికి అనుగుణంగా బొగ్గు సరఫరా జరిగేలా సీఎండీ బలరామ్ నాయక్ నాయకత్వంలో క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా శ్రీరాంపూర్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జీఎం మునిగంటి శ్రీనివాస్ సారధ్యంలో క్వాలిటీ విభాగం బొగ్గు నాణ్యత పెంపుకు అడుగడుగునా అవగాహన కార్యక్రమాలతో కృషిచేస్తోంది. బహిరంగ మార్కెట్లో నెలకొన్న పోటీని తట్టుకొని వినియోగదారులను ఆకర్షించటం మనం ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత ద్వారానే సాధ్యమని ప్రతీ ఉద్యోగి తనకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహిస్తూ అప్రమత్తతో బొగ్గు నుంచి షేల్ వేరుచేయాలని సూచిస్తున్నారు. లోడింగ్ పాయింట్లు, సీహెచ్పీలలో సేల్, మల్వ, తుంటలు, ఇనుప చువ్వలు వంటి ఇతర వస్తువులు ఎక్కడికి అక్కడ వేరు చేయాలని కరపత్రాలు, పోస్టర్లు, సందేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. లేని పక్షంలో వినియోగదారులు మనం పంపే బొగ్గును తిరస్కరించటమే కాక పేనాల్టీలతో పాటు రవాణ ఖర్చుల రూపంలో ఏటాటా కోట్ల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్వయంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ సైతం గనులు, ఓసీలు, కార్మిక కార్య క్షేత్రాల పర్యటనలు , కార్యక్రమాల్లో బొగ్గు నాణ్యత ప్రాధాన్యతను వివరిస్తూ శ్రీరాంపూర్ ఏరియాలో క్వాలిటీ పెంపుకు కృషిచేస్తున్నారు. జీఎం ప్రత్యేక చొరవ , క్వాలిటీ విభాగం కృషి వెరసి బొగ్గు నాణ్యతలో సింగరేణిలోనే మేటి గా నిలుస్తోంది శ్రీరాంపూర్ ఏరియా గత ఆర్థిక సంవత్సరం 75 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. బుధవారం సింగరేణి హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన నాణ్యత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సంస్థ సీఎండీ బలరామ్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి స్వీకరించారు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, అధికారులు సంస్థ స్థాయిలో నాణ్యత విషయంలో ఏరియాకు మొదటి బహుమతి రావటంలో కృషిచేసిన క్వాలిటీ విభాగం అధికారులను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు 78.50 శాతం ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 85 శాతంతో మరొక్కసారి శ్రీరాంపూర్ ఏరియా సత్తాచాటాలని పిలుపునిచ్చారు జీఎం మునిగంటి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, రవి కుమార్,సివిస్పీఎస్ ఈ చంద్రలింగం, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, క్వాలిటీ ఇన్చార్జ మేనేజర్ కె వెంకటేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య వివిధ గనుల మేనేజర్లు, రక్షణ అధికారులు,పిట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో సామూహిక వందేమాతర గీతాలాపన

**బెల్లంపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో మెయిన్ బజార్ వద్ద సామూహిక వందేమాతరం గీతాలాపన గేయం ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మరియు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమాజీ సామూహిక వందేమాతరం కార్యక్రమ జిల్లా సహ ఇంచార్జ్ పులగం తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతట జరుగుతున్న సామూహిక వందేమాతరం గీతలాపన చేయడం జరిగింది. ఆనాడు బ్రిటిష్ వాళ్లని వెళ్లగొట్టడానికి ఈ వందేమాతర గీతం అందరిలో స్ఫూర్తినిచ్చింది, ధైర్యాన్ని నింపింది అన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు పట్టణ ప్రజలు పాల్గొనడం సంతోషకరమని వారు అన్నారు. అలాగే నరేంద్ర మోడీ పరిపాలనలో దేశం సుభిక్షంగా ఉంది. మన దేశం ఆర్థికపరంగా ముందుకెళ్లాలంటే స్వదేశీ వస్తువులనే కొని మన జిడిపిని పెంపొందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, మాజీ కౌన్సిలర్ రాజు లాల్ యాదవ్, సీనియర్ నాయకులు మద్దర్ల శ్రీనివాస్, కోయల్కర్ గోవర్ధన్, జిదుల రాములు, పట్టణ ఉపాధ్యక్షులు సల్లం సుమలత, పట్టణ కోశాధికారి సంతోష అగర్వాల్, షేక్ గౌస్ బాబా, ఎర్రోజు శ్రీనివాస్, కోదాటి కళావతి, గర్రెపల్లీ రాకేష్, గంపల చంద్ర మొగిలి మరియు వ్యాపారవేత్తలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



# ఎ.టి.సి. ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**- పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ**

**మంచిర్యాల,నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా








విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా అవకాశాలు కల్పించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐ. టి. ఐ. ప్రాంగణంలో గల అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ (ఎ.టి.సి.) ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ వై. రమేష్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వివిధ ట్రేడ్ లలో నిరుద్యోగ యువతకు వృత్తి విద్య శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చుని, కోర్సు శిక్షణ అనంతరం అప్రెంటిస్ సమయంలో దాదాపు నెలకు 12 వేల రూపాయల వరకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు వృత్తి విద్య శిక్షణ అందించి వారి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసి భవిష్యత్తులో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ**

# 11వ వార్షికోత్సవ వేడుకలు

**సిరికొండ, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

ప్రపంచ మత్స్య కారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్



మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలు సిరికొండ ముదిరాజ్ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ సంఘం సభ్యులు తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తేవాలని డిమాండ్ చేశారు. సభ్యులు, సంఘం ప్రతినిధులు సమగ్ర అభివృద్ధి, విద్య, సామాజిక హక్కుల పరిరక్షణ కోసం మద్దతు కల్పించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెంటన్న, ముదిరాజ్ ఎగ్గిడి మల్లారెడ్డి, బోయినవాడ్ అమోల్, విజయ్ కుమార్, రాములు, శ్రీనివాస్, అశోక్, ప్రవీణ్, మల్లేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ట్రేస్ చేసి యజమానికి అప్పగింత

**వాంకిడి, నవంబర్ 21,సూర్య మేజర్ న్యూస్**

ఆసిఫాబాద్ కు చెందిన లక్కరావు కు చెందిన రెడ్మీ మొబైల్ ఇటీవల వాంకిడి మార్కెట్ ప్రాంతంలో పోయింది. ఈ విషయంపై బాధితుడు వాంకిడి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి యజమానికి తిరిగి అప్పగించారు.ఈ సందర్భంగా వాంకిడి ఎస్.ఐ.మహేందర్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన సందర్భంలో బాధితులు తక్షణమే సీఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. దీంతో మొబైల్ ట్రేస్ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు.మొబైల్ ట్రేసింగ్‌లో ప్రతిభ కనబరిచిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ఎస్.ఐ. మహేందర్ అభినందించారు.

# అటవీ సంపద అందరి బాధ్యత

**- రాష్ట్ర పీసీసీఫ్ ఎలీ సింగ్ మేరు - కర్జల్లి రేంజ్ లో పర్యటన**

**చింతలమానేపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

అటవీ సంపద మనందరి బాధ్యతని రాష్ట్ర పిసిసిఎఫ్ ఎలీసింగ్ మేరు



అన్నారు. మండలంలోని కర్జవెల్లి రేంజ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. రేంజ్ పరిధిలోని దిందా, బండల్ హెటి అటవీ ప్రాంతాల్లో ఉన్న పోడు భూములను, అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. సిబ్బందికి అటవీ రక్షణ కోసం ఫైర్, పెట్రోలింగ్ కు సంబందించిన వాహనం అందజేశారు. అడవుల ప్రాముఖ్యత, అటవీ జంతువుల సంరక్షణపై గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ డి పి టి శాంతారాం, ఎఫ్ డి ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్, కాఘజ్ నగర్ డి ఎఫ్ ఓ సుశాంత్, ఎఫ్ ఆర్ ఓ సుభాష్, ఎస్సై ఇస్లావత్ నరేష్, ఎఫ్ ఎస్ఓలు, ఎఫ్ బీ ఓ లు, అటవీ సిబ్బంది ఉన్నారు.

# సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**చింతలమానేపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి



చదువుతున్న రైతు విష్ణువర్ధన్ అనే విద్యార్థి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ జెడ్పి పాఠశాల మైదానంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇచ్చోడ లో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా ఇదే విద్యార్థి రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. దీంతో ఎంఈఓ జయరాజు, ఇంచార్జి హెచ్ఎం దాణేష్, పీడి (కోచ్) హరీష్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, పలువురు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**బేల, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ




నాయకులతో కలిసి శుక్రవారం టాక్లి గ్రామ లబ్ధిదారులకు తహసీల్దార్ కొట్నాక్ రఘునాథ్ రావ్ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు అవినాష్, సాగర్, రాకేష్, కన్నే రాజు తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

**- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**సిరికొండ నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కొండాపూర్ బ్రిడ్జి పనులను వేగంగా నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శుక్రవారం



కొండపూర్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు సకాలంలో పూర్తిచేయాలని, పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటూ, అవసరమైన చోట పనుల వేగం పెంచాలని సూచించారు. పనులు స్థిరంగా కొనసాగేలా రోజువారీ మానిటరింగ్ చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల మైనార్టీ చైర్మన్ ఎండి రంజాన్, అల్లం స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

**- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**- కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

**సిరికొండ, నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్**

పేద ప్రజల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని



తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 27 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసి ప్రజా ప్రభుత్వం మాట నిలబెట్టిందని గుర్తుచేశారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమరం సత్యవతి కోటేశ్వర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహశీల్దార్ తుకారాం, డిప్యూటీ తహశీల్దార్ ఉపేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ ఆనంద్ రావ్ ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజాన్, నవీణ్, మాధవ్ పటేల్, రఘురాం, అనిల్ కుమార్, రషీద్, మసూద్, ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి .. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వయోవృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై వృద్ధులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడానికి ఎవరూ లేని పక్షంలో ఓల్డ్ ఏజ్ హోమ్స్/స్వచ్ఛంధ సంస్థల సహాయంతో సంరక్షించడం జరుగుతుందని, ట్రిబ్యునల్ లో దరఖాస్తు చేసుకున్న వారికి సహాయం అందించడం జరుగుతుందని, వయోవృద్ధుల దరఖాస్తులను పోలీసు, రెవెన్యూ సిబ్బంది సానుకూల దృష్టితో చూడవలసిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం సంబంధించిన విధివిధానాలు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధులు tgseniorcitizens.gov.in వెబ్సైట్ ద్వారా వారి సంరక్షణకు సంబంధించిన దరఖాస్తు, ట్రిబ్యునల్ కు అప్పీలు, ఎవిక్షన్ ఆర్డర్, అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ వెబ్సైట్ ద్వారా సీనియర్ సిటిజన్స్ యాక్ట్ చట్టాన్ని డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వయావృద్ధులు శారీరకంగా, మానసికంగా కలిగే ఇబ్బందులను ఫిర్యాదు చేయవచ్చని, రెవెన్యూ, పోలీస్, సంక్షేమ శాఖల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ కొరకు అనేక చర్యలు తీసుకుంటుందని, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వ సేవలు వినియోగించుకోవచ్చు అని తెలిపారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఖర్చు చేయాలని, ఏదైనా సలహాలు సూచనల కొరకు అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం జాతీయస్థాయిలో జల సంరక్షణలో భాగంగా అవార్డు పొందిన జిల్లా కలెక్టర్ ను తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. వయోవృద్ధులను సత్కరించారు.జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు జిల్లా కలెక్టర్ పై ప్రత్యేక పాట పాడి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విత్తనాల వినియోగంతోనే

## అధిక దిగుబడులు

### - విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి

**కడెం, నవంబర్ 21,సూర్య మేజర్ న్యూస్ :**

నాణ్యమైన విత్తనాల ద్వారానే దిగుబడి సాధ్యం అవుతుంది అని రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి అన్నారు.కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలోనీ రైతు వేదికలో రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై విత్తన సరఫరా, నాణ్యత, రాబోయే



సీజన్ లో సాగు పద్ధతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని అందుకోసం విత్తనాభివృద్ధి సంస్థ పూర్తి స్థాయిలో కట్టుబడి పనిచేస్తుందని అన్వేష్ రెడ్డి రైతులకు తెలియజేశారు.రైతులు నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాలను ఉపయోగించి అధిక ఉత్పాదకతను సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి,మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్,సుజాత ,నాయకులు రమేష్ రావు,బొడ్డు గంగన్న, భూమరాజం, గోళ్ళ వెంకటేష్, కాల్వ తిరుపతి ,సౌదని రాజన్న , వ్యవసాయ అధికారులు , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### బోథ్‌లో చెక్ ముకి

## సైన్స్ టాలెంట్ టెస్ట్


**బోథ్: నవంబర్ 21.సూర్య మేజర్ న్యూస్:**



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ 2025 ను శుక్రవారం బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ యొక్క ప్రాముఖ్యత, శాస్త్రీయ వైజ్ఞానిక అంశాలకు సంబంధించి పోటీ పరీక్షలకు ఏ విధంగా సన్నదం కావాలన్న విషయాలపై విద్యార్థులకు తెలియజేశారు. అలాగే జన విజ్ఞాన వేదిక పరీక్ష నిర్వాహకులు బైరి సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ,వైజ్ఞానిక దృక్పథాన్ని అలవరచాలన్న ఉద్దేశంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఈ పరీక్షను పాఠశాల, మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8,9,10 వ తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

### టీఎస్ యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

**చింతలమానేపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ దుబ్బగూడా నందు టీఎస్ యుటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఉషన్న మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పి.ఆర్.సి అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డిఏ.లను వెంటనే విడుదల చేయాలని, ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయాలని, బోధనేతర




కార్యక్రమాల పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర మహేందర్ గౌడ్,బి సచిన్మాట్లాడుతూ మండలంలోని బి సచిన్ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి సంఘ పక్షాన కృషి చేస్తామని తెలియజేశారు. తదనంతరం టీఎస్ యుటిఎఫ్ చింతలమానేపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో అధ్యక్షులు బుర్ర మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు సెడ్మకే కిరణ్ కుమార్, కోశాధికారి గండం రాజన్న, ప్రధాన కార్యదర్శి బర్పత్ వార్ సచిన్, కార్యదర్శులు : ఏ రాకేష్, కునాల్,శ్రీజా నందిని ఎస్ ఓ కేజీబీవీ, శ్రీదేవి కేజీబీవీ పై కమిటీని సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోమురళి,శ్రీకాంత్ గౌడ్,నిఖిల్,తిరుపతి,పరమేశ్వర్,సంతోష్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీకి

## డెడ్ బాడీ ఫ్రీజర్ అందజేత

**కడెం, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి రంజిత్, సుదర్శన్ రాజ్ ,పడాల రాజేష్ హారిక, దేసెట్టి లావణ్య భూమేష్, దానవేణి భూమక్క, సరిత రాజేంద్రప్రసాదులు కలిసి లింగాపూర్ గ్రామపంచాయతీకి డెడ్ బాడీ పెట్టే ఫ్రీజర్ను అందించారు. ఈ డెడ్ బాడీ ఫ్రీజర్ నిర్వహణ బాధ్యతను గ్రామపంచాయతీ అధికారులు చేయబడతారు వారు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ లింగాపూర్ గ్రామంలో ఎవరికైనా ఈ ఫ్రీజర్ పెట్టే అవసరం అయితే వారు 500 రూపాయలు అదేవిధంగా ఇతర గ్రామాల వారు దీనిని అవసరంగా వినియోగించుకుంటే వారికి 1000 రూపాయల వరకు ఖర్చు నిర్ణయించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా డెడ్ బాడీ ఫ్రీజర్ పెట్టేను పంచాయతీకి అందించిన వీరిని గ్రామ ప్రజలు అభినందించారు.



# స్థానిక ప్రజల సంక్షేమం, భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటాం

## - మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్.- బెల్లంపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో గిరిజన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ.

**బెల్లంపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:** మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాల వృద్ధులకు చలి నుండి రక్షణ కల్పించేందుకు బెల్లంపల్లి రూరల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో నెన్నెల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖర్జీ అనే మారుమూల గ్రామంలో అమెరికాలో ఉన్న గుడిమల్ల మమత సహకారంతో 150 రగ్గు దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ చలి తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో,వారికి రక్షణ కల్పించేందుకు సామాజిక బాధ్యతలో భాగంగా పోలీస్ అధికారులు స్వయంగా గిరిజన గ్రామాలను సందర్శించి ఈ ప్రాంతం లో ఉన్న సమస్యలు తెలుసుకొని, స్థానిక ప్రజల సంక్షేమం,భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని, ఇటువంటి ముందుంటారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుప్పట్లను డొనేట్ చేసిన గుడిమల్ల




సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా కొనసాగుతాయని డీసీపీ తెలిపారు. ప్రజల అండతో పోలీస్ వ్యవస్థ మరింత బలపడుతుందని, సామాజిక సేవలో పోలీసులు ఎప్పుడూ మమత కు డీసీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సిఐ సిహెచ్ హనోక్, నెన్నెల్ ఎస్ ఐ ప్రసాద్, నెన్నెల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు

# ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

**ఆసిఫాబాద్, నవంబర్21,సూర్య మేజర్ న్యూస్ :** వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆసిఫాబాద్ సిఐ బాలాజీ వరప్రసాద్ అన్నారు.




శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు పెట్టుకోవాలన్నారు, అలాగే సెల్ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం త్రిబుల్ రైడింగ్ చేయడం రాంగ్ రూట్లో వెళ్లడం మైనర్ డ్రైవింగ్ చేయడం లాంటివి చేసినట్లు అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో భాగంగా శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్ ప్లేట్లు లేని బైక్లను గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## తిర్యాని పోచమ్మ గుడిని దర్శించుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్

### - ఆలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి వినతి పత్రం

**తిర్యాని,నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:** జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ శుక్రవారం రోజున తిర్యాని గ్రామంలో కొలువై ఉన్న మహిమానితమైన పోచమ్మ గుడిని



దర్శించుకుని. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం, గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామస్తులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం, హనుమాన్ మందిర్ , శ్రీరామాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే రేకుల షెడ్ నిర్మాణ పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీనివాస్ గౌడ్, మడావి శ్రీరాములు, దౌలత్ రావు, బొజ్జి రావు, జగదీష్, రాజేష్, సురేష్, ఆత్రం గోపి, అన్నం వెంకటేష్, జుగునాక మారుతి, నాగపురి కరుణాకర్ గౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సోయా రిజెక్షన్తో ఇబ్బందులు పడుతున్న రైతులు:

## కలెక్టర్ ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

### - నాఫెడ్ విధానంపై చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి

**ముధోల్, నవంబర్ 21,సూర్య మేజర్ న్యూస్:** జిల్లాకు లభించిన జల్ శక్తి-జల్ భాగిదారి అవార్డు అందుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, డీఆర్డీఏ విజయలక్ష్మిను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ కు వివరించారు. సోయా కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్మిన సంచులను లారీ ద్వారా గోదాములకు పంపిన తర్వాత, కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ప్రతి లారీపై 200 నుంచి 300 సంచుల వరకు తిరస్కరించి మళ్లీ కేంద్రాలకు తిరిగి పంపుతున్నట్లు తెలిపారు. నిన్నటి నుండి నాఫెడ్ సర్వేయర్లు ప్రతి కొనుగోలు కేంద్రానికి వచ్చి అక్కడికక్కడే రిజెక్ట్ చేయడం వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు, తదితరులున్నారు.



## రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నది.

### - ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముధోల్, నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్.** రైతులు పండించిన ధాన్యంకు, గిట్టుబాటు ధర కల్పించటం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను శుక్రవారం



ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సన్న రకం ధాన్యం కు ప్రభుత్వం నుంచి వచ్చే బోనస్ డబ్బులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. 28 ప్యాకేజీ పనులు ముందుకు సాగే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ విషయంను ఇప్పటికే రాష్ట్ర ఇరిగేషన్ మంత్రిదృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సీఎం నుండి హామీ లభించిన వెంటనే 28 ప్యాకేజీ పనులు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. ఇది పూర్తి అయితే 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తాను ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ 28ప్యాకేజీ పనులు పూర్తిఅయ్యేంత వరకు నిరంతరం కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, మాజీ జెడ్పిటిసి లక్ష్మీ నర్స గౌడ్, ఏపిఎం గురు చరణ్, ఎఓ రచన, మాజీ ఎంపిటిసిలు బందారి గంగాధర్, ఆత్మ స్వరుప్, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్,బి జె పై ఎం మండల అధ్యక్షులు సూర్యవంశీ శ్రీధర్ పాటిల్, నాయకులు విశ్వనాథ్ పటేల్, రవికిరణ్ గౌడ్, తాటేవార్ రమేష్,సతీష్ రెడ్డి, రాము, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మరోసారి మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం-తెలంగాణ బీసీ హక్కుల నేత సుంకెట పోశెట్టి

**భైంసా టౌన్,నవంబర్ 21,సూర్య మేజర్ న్యూస్:** బీసీలకు స్థానిక ఎన్నికలల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ది ఉంటె వెంటనే అఖిల పక్ష నాయకులకు డిల్లీకి తీసుకెళ్లి,శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల గురించి గళం విప్పి9వ షెడ్యూల్ లో చేర్పించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తూ, 42శాతం రిజర్వేషన్ల ను అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

# నిర్వహించిన పోలీసులు.

**గుడిహత్నూర్ నవంబర్ 21 మేజర్ సూర్య న్యూస్:** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని నేరడిగొండ తాండలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్పి. పోతారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేరడిగొండ తాండలో తనిఖీలు నిర్వహించి 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని గుడుంబా అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే గుడుంబా అమ్మడం, గంజాయి పండించి రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి ముఖ్యంగా హెల్మెట్ ధరించి ప్రాణనష్టాన్ని తగ్గించాలన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీ లలో సరైన ధృవపత్రాలు లేనటువంటి 27 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, రెండు ఆటోలు, రెండు ట్రాక్టర్లు, తాత్కాలికంగా స్వాధీన పరచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడా సీఐ బి. రాజు, ఎస్సైలు శ్రీకాంత్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగరేణిలో 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం

**మందమర్రి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్.** సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల మెరుగుదల వంటి అంశాలపై సింగరేణి సంస్థ చైర్మన్ ఎన్ బలరామ్ శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు "డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల కార్మికులు పాల్గొనవచ్చని, సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల పెంపుదలకు నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా పంచుకోవచ్చని, ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 040-23311338 నెంబర్ కు కాల్ చేయాల్సి ఉంటుందని సింగరేణి అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

**ఖానాపూర్ టౌన్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ను గంగ పుత్రులు ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా భీష్మని చిత్రపటానికి పూలమాలవేసి, పూజలు చేసి, నీలిరంగు జెండాను ఎగురవేసినారు. అధ్యక్షులు పరిమి సురేష్ మాట్లాడుతూ చేపల వేట



ప్రమాదకరమైన వృత్తి అని, ఈ వృత్తిని చేసే గంగపుత్రులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని అన్నారు. గంగపుత్రులు చెరువులు మావే... చేపలు మావే అని నినాదం చేసినారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పరిమి రమేష్, డైరెక్టర్లు మైలారపు గంగాధర్, భీమన్న, రవి, పెద్ద బోయిలు, చంద్ర విలాస్, లాలు, పెద్ద మనుషులు లక్ష్మణ్, నర్సయ్య, భీమ్ రావ్, గణేష్, నరేష్, ప్రశాంత్, నవీన్, సాయన్న, భీమ రాజం, సురేష్, రమేష్, సంతోష్, రాజు, చంటి, ప్రవీణ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు బ్రిడ్జ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**కాగజ్నగర్, నవంబర్ 21 సూర్య, మేజర్ న్యూస్:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహగం మండలంలోని బొప్పురం గ్రామానికి బీటీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. దహేగాం మండలంలోని బొప్పురం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రూ. 3 కోట్ల 13 లక్షల



అంచనాతో నిర్మించనున్న బ్రిడ్జి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా బొప్పురం గ్రామానికి రావడం జరిగిందని, అప్పుడు తాము ఇచ్చిన హామీ మేరకు ఈరోజు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలియజేశారు.

### అనిల్ అన్న యువ సైన్యం

## ఆధ్వర్యంలో బాధితులకు చేయూత

**తిర్యానీ, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

మండలంలో అగ్నిప్రమాద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ తిర్యానీ మండలంలోని మంగి ముల్కలమంద గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన సీడం మారుతి కుటుంబానికి అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు తమ వంతు 'చేయూత' అందించారు. గ్రామానికి చెందిన సీడం మారుతి ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి, ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు వెంటనే స్పందించారు. శుక్రవారం, నాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్నం హరీష్ కుమార్ పెరుమండ్ల వెంకటేశం గౌడ్ల చేతుల



మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో మండలంలో అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదం గురించి తెలియగానే బాధితులకు సహాయం అందించడానికి తాము ముందుకు వచ్చామని వారు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో మండల నాయకులు వల్క రామచందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పడిగల అమర్, యూత్ ఉపాధ్యక్షులు రాయిసీడం వినోద్, మడావి శ్రీనివాస్, ఉయిక గోవింద్ తదితరులు పాల్గొన్నారు. యువ సైన్యం చేసిన ఈ సేవను స్థానికులు అభినందించారు.

## అమ్మవారి ఆలయము ముందు నూతన షెడ్డు నిర్మాణం

**శ్రీరాంపూర్, నవంబర్ 27, సూర్యా మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ సింగరేణి ఏరియా స్టోర్స్ లో జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అమ్మవారి ఆలయం ముందు నూతనంగా నిర్మించిన షెడ్డును, కార్యాలయానికి ముందు సుమారు నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సౌకర్యంతో వారికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని,



అందులో భాగంగా ఏరియా స్టోర్ లో కార్యాలయ సమావేశాల కొరకు స్టేజి ముందు నూతన షెడ్డును ప్రారంభించడం అభినందించదగిన విషయమని, ఉద్యోగుల పదవి విరమణ, ఇతర సమావేశాలకు ఈ షెడ్డు ఉపయోగపడుతుందని, అలాగే అమ్మవారి ఆలయం ముందు నూతనంగా నిర్మించిన షెడ్డు ఉద్యోగులకు ఆయా పూజా కార్యక్రమాల సమయంలో సౌకర్యవంతంగా ఉంటుందని, అమ్మవారి ఆలయం ముందు ఉన్న షెడ్డు నిర్మాణానికి ఉద్యోగులు వారి వంతు ఆర్థిక సహాయం చేయడం అభినందించదగిన విషయమని తెలియజేశారు. వీటిని ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని, శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న అన్ని జనులకు విభాగాలకు కావలసిన అన్ని యంత్రాలు యంత్ర పరికరాలు ఏరియా స్టోర్ లోనే భద్రపరచడం జరుగుతుందని అలాగే వారికి కావలసిన యంత్రాలు యంత్ర సామాగ్రిని ముందుగానే తెప్పించుకొని దానిలోకి విభాగాలకు పంపిస్తూ ఉండాలని దానికి ముందస్తు ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే ప్రస్తుతం గనులు విభాగాలలో ఉద్యోగుల హాజరు శాతం తగ్గుతుందని తప్పనిసరిగా ఉద్యోగులు వారి యొక్క హాజరు శాతాన్ని మెరుగు పరుచు కోవాలని సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా ప్రతినెల 16 నుండి 20 మాస్టర్లు చేసే విధంగా ప్రణాళిక రూపొందించుకొని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని సంస్థ పురోగతి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఓ టు జిఎం కుర్మా రాజేందర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ పి సుమలత, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, డీజీఎం ఏరియా స్టోర్స్ మల్లయ్య, డీజీఎం ఇంటర్నల్ ఆడిట్ ఎం. దామోదర్, సి హెచ్ పి ఎస్ ఈ చంద్రలింగం, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, టింబర్ యార్డ్ అధికారి రామ్మోహన్ రావు, పిట్ సెక్రటరీలు కుమార్, సమ్మయ్య అలాగే ఏరియా స్టోర్స్, టింబర్ యార్డ్ ఉద్యోగిని ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల క్వార్టర్ల కౌన్సిలింగ్

**శ్రీరాంపూర్, నవంబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారుల క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్ లో 07 మంది అధికారులు వారి యొక్క సీనియారిటీ ప్రకారం క్వార్టర్ల ను ఎంచుకోవడం జరిగింది. క్వార్టర్ కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ ఇన్చార్జి ఎస్ఓ టు జిఎం కుర్మా రాజేందర్, క్వార్టర్ కౌన్సిలింగ్ కమిటీ సభ్యులు ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్, ఇన్చార్జి డీజీఎం (సివిల్) సత్యనారాయణ, ఎస్టేట్స్ అధికారి మహేష్, సీనియర్ పిఓ ఎస్. సురేందర్, సీనియర్ అసిస్టెంట్ ఎల్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏటీసీ సెంటర్ ని సందర్శించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**నస్పూర్, నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల పట్టణంలోని ఐటిఐ సెంటర్‌లో ఉన్న ఏటీసీ సెంటర్‌ను, శుక్రవారం, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ సందర్శించినారు. వారికి టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, పుష్ప గుచ్చం తో స్వాగతం పలికారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలకై తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని, ముఖ్యమంత్రితో, క్యాబినెట్ మంత్రులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు, నాగుల గోపాల్, టీఎన్జీవో మంచిర్యాల జిల్లా మాజీ సంయుక్త కార్యదర్శి వై రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

### - అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్

**కాగజ్నగర్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండల కేంద్రంలో ఈ రోజు శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ఐకేపి ఆధ్వర్యంలో నిర్వహించే రెండు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు అమ్మాలని, తద్వారా మద్దతు ధరతో పాటు బోనస్ పొందవచ్చని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన మీదట అభివృద్ధి పనులను చేపట్టనున్నామని, అందులో భాగంగా కల్వాడ నుండి ఒడ్డుగూడ వరకు రూ.41 కోట్ల అంచనాతో బ్రిడ్జిలతో సహా డబుల్ బీటీ రోడ్ నిర్మించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్డిఓ దత్తారావు, డిసీఎస్ఓ వసంత లక్ష్మీ, జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకటి, ఏడీఓ మనోహర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ధనుంజయ్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, పీఏసీఎస్ అధికారి, సామ్యూల్, ఎమ్మార్వో షరీఫ్, ఏపీఎం ప్రకాష్, సీఈఓ బక్కన్న, ఎంసి ధన్ రాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోగన్న, ఆర్ఐ నాగభూషణం, ఏఈఓ లావణ్య, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, ప్రణీత్, భాజపా మండల అధ్యక్షులు దామోదర్, రైతులు, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో చలి పంజా గజ గజ వణుకుతున్న ప్రజలు

## ఇంటింటికి చలి మంటలు కనిష్ట స్థాయికి పడిపోయిన

## పగటి ఉష్ణోగ్రతలు హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

**ఖానాపూర్ టౌన్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇంటి నుండి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉదయము, రాత్రి ఏ ఇంటి వద్ద చూసిన, ఈ వీధిలో చూసిన చలిమంటలే కనిపిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సైతం కనిష్ట స్థాయికి పడిపోయినవి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసినారు. మైదాన ప్రాంతంలో కంటే ఏజెన్సీ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. జాగ్రత్తలు పాటించకుంటే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యాధికారులు అంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చలి తీవ్రత వల్ల కలిగే వ్యాధుల నుండి ప్రజలను రక్షించడానికి సిద్ధంగా ఉంది. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అస్తమా లాంటి వ్యాధిగ్రస్తులు పలు జాగ్రత్తలు పాటించాలని ప్రచారం చేస్తున్నారు. గత పది సంవత్సరాలలో ఇంత చలి తీవ్రతను ఎన్నడు చూడలేదని ప్రజలు అంటున్నారు. చలి తీవ్రత పెరగడంతో ఉన్ని తో తయారైన వస్త్రాలకు డిమాండ్ బాగా పెరిగింది. ఉదయము 8 గంటల వరకు ఎవరు బయటకు రావడం లేదు. రాత్రి 7 గంటల తర్వాత ఎవరు బయట కనిపించడం లేదు అంటే చలి తీవ్రత ఎంత మెండుగా ఉందో అర్థమవుతుంది.సంచార ప్రజలు టెంట్లు వేసుకుని టెంట్ల కింద చలికి గజగజ వణుకుతూ కాలం వెళ్ళదిస్తున్నారు. చలి తీవ్రత దృష్ట్యా సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత ఎక్కువగా బయటకు రావద్దని అనుభవజ్ఞులైన ప్రజలు తెలుపుతున్నారు.

## కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి

### ఐ ఎన్ టి యు సి కేంద్ర - ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు

**శ్రీరాంపూర్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

ఎస్ఆర్‌పి త్రీ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న కీలక సమస్యలు పరిష్కరించాలని, ఐఎన్టియుసి కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పి త్రీ గని లో ఫిట్ సెక్రటరీ ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన బాయి బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కార్మికులకు త్రాగునీటి సమస్య లేకుండా 2000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్ ఓ ఆర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. కోల్ కట్టర్, ట్రామర్, లైన్ మెన్, సపోర్ట్ మెన్ వంటి క్యాటగిరి పనులుచేస్తున్న వారికి, ఐఈడి విభాగం పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ప్రమోషన్లు ఇవ్వలేదని అన్నారు. మహిళా ఉద్యోగినిల టాయిలెట్స్ హైజీనిక్ కండిషన్‌లో నిర్వహించడం లేదని, వాటికి వెంటనే డోర్లు ఏర్పాటు చేసి సరియైన మెంటేనేన్స్ నిర్వహించాలన్నారు. చలికాలం కోసం ఇవ్వాల్సిన వామ్ కోట్స్, ఇంకా అందలేదని అన్నారు. రెగ్యులర్ టెక్నీషియన్ తో పాటు హెల్పర్స్ కూడా ఉండాలని అన్నారు. అన్ని సమస్యలు యాజమాన్యంతో చర్చించామని, వారు స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పి త్రీ గని ఫిట్ సెక్రటరీ ఆర్ గోపాల్, గరిగ స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో
# తాగునీటి కష్టాలు తీరనున్నాయి: ఎమ్మెల్యే

**కాగజ్నగర్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.31.50 కోట్లు మంజూరు చేసింది.పట్టణాభివృద్ధి కోసం ఇది వరకు యు ఐ డి ఎఫ్ కింద మంజూరు చేసిన రూ.18.70 కోట్ల నిధులకు ఇది అదనం. రెండు పద్దుల కింద రూ.50.20 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుంది. పట్టణంలో తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని



ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖను గతంలో కోరడం జరిగింది. స్పందించిన కేంద్ర ప్రభుత్వం అర్బన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్ మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) పథకం కింద ఈ నిధులను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ హౌజింగ్ బ్యాంక్ (ఎన్ హెచ్ బి) ఇచ్చిన ఈ నిధులతో పట్టణంలో తాగునీటి వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటాము. ఈ నిధులతో పట్టణంలో మూడు ఓవర్ హెడ్ ట్యాంక్స్, అండర్ గ్రౌండ్ పైపులైన్ విస్తరణ పనులు చేపట్టనున్నాము. ఇప్పటికే పట్టణంలో ఐదు ఓవర్ హెడ్ ట్యాంక్ల ద్వారా పట్టణవాసులకు ప్రతీ రోజు 8 వేల కిలో లీటర్ల నీటిని అందిస్తున్నాము. ప్రస్తుతం మంజూరైన నిధులతో మరో మూడు ట్యాంక్లు (500 కెఎల్ (2), 800 కెఎల్ (1) నిర్మాణం చేపడితే వీటి ద్వారా అదనంగా 1800 కిలో లీటర్ల నీటిని పట్టణ వానులకు అందించేందుకు అవకాశం ఉంది. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలియజేసిన సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు.


# వామ్మో... వానరం

**ఖానాపూర్ టౌన్ ,నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్**

ఒకప్పుడు వానరం ను చూడటానికి పరుగులు తీసిన జనం ఇప్పుడు వానరం కనిపిస్తే, వామ్మో... వానరం అంటూ పరుగులు పెడుతున్నారు. వానరాలంటే ప్రజలు అంతగా భయపడిపోతున్నారు. వానరాలు ఎప్పుడు, ఎక్కడ, ఎవరిపై ఎలా దాడి చేస్తాయో అర్థం కాని పరిస్థితి ప్రతి గ్రామంలో నెలకొంది. ఇంటిలో చొరబడి వంట సామాగ్రిని ఎత్తుకు వెళ్లడం, పిల్లల చేతుల్లో తిను పదార్థాలు ఉంటే లాక్కు వెళ్లడం, కోడి పిల్లలను సైతం ఎత్తుకు వెళ్లి భుజించడం, దారి వెంట వెళ్తున్న మహిళలను, వృద్ధులను, పిల్లలను




భయభ్రాంతులకు గురి చేయడం లాంటి చేష్టలు వానరాలు చేస్తున్నాయి. ఒక్క వానరంను బెదిరిస్తే బెటాలియన్లకు బెటాలియన్ల వానర దండు తరలివస్తుంది. వానరం ను బెదిరించిన వారి భరతం పడతాయి. కోతులు మెట్లపై కూర్చుండడంతో ఇంటిలోకి వెళ్లలేక, ఇంటి బయటకు రాలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కోతుల భయంకు పిల్లలు బడికి వెళ్లలేకపోతున్నారు, కూరగాయలు అమ్మేవారు కూరగాయలు అమ్మ లేకపోతున్నారు, దారి వెంట వెళ్లేవారు వెళ్లలేకపోతున్నారు అంటే కోతులు ప్రజలను ఎంతగా భయభ్రాంతులకు గురి చేస్తున్నాయో అర్థం అవుతూనే ఉంది. పంట పొలాలను, ఇంటి పెరటి తోటను, చెట్ల మీది పండ్లను ఇవి నాశనం చేస్తున్నాయి. విద్యార్థులు, పిల్లలు, మహిళలు, వృద్ధులు, బాటసారులు ప్రతినిత్యం కోతులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రౌడీ వానరాల నుండి తమను రక్షించాలని ప్రజలు అధికారులను, ప్రజా ప్రతినిధులను నిరంతరం వేడుకుంటూనే ఉన్నారు. అయినా కానీ అధికారులలో చలనము రావడం లేదు, ప్రజా ప్రతినిధులు కనికరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కోతుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను నివారించాలని, అడవిలో పండ్ల చెట్లు పెంచి వాటిని అడవికి పంపాలని కోరుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఖానాపూర్ పట్టణంలో కోతుల నివారణ ఉద్యమం ప్రారంభమైనది. ఉద్యమం ఊపిరి పోసుకోకముందే అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి కోతుల నివారణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.



# డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ జన్మదిన వేడుకలు

**మందమర్రి, నవంబర్ 22, సూర్య మేజర్ న్యూస్.**

మంచిర్యాల డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలు మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శుక్ర వారం కాంగ్రెస్ పార్టీ పీసిసి సభ్యులు నూకల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూకల రమేష్ మాట్లాడుతూ, చెరగని చిరునవ్వు, చెదరని ఆత్మవిశ్వాసం, మాట ఇస్తే తప్పనితనం, పేదల గురించి ఆలోచించే తత్వం అన్ని కలబోసిన నాయకురాలు మంచిరాల డిసిసి అధ్యక్షురాలు సురేఖమ్మ అని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి డిసిసి అధ్యక్షురాలుగా సురేఖమ్మ పార్టీకి విశేష కృషి చేశారని, జిల్లాలో మూడు నియోజకవర్గాలను అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించారని ఆమె సేవలను కొనియాడారు. జిల్లాలో భారత్ జోడో యాత్ర, ఆజాద్ కి గౌరవ్ యాత్ర, రాజీవ్ సద్భావన యాత్ర, వంటి కార్యక్రమాలు వందల కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర వంటి కార్యక్రమాల విజయవంతం చేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశారన్నారు. అహర్నిశలు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, పేద బడుగు బలహీనవర్గాల వారికి అండగా నిలిచారని అన్నారు. ప్రజలకు మేలు కలిగించే సామాజిక సేవా కార్యక్రమాలు అనేకం చేపట్టి ఆమె జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని, పేద ప్రజల పెన్నిధై, అనుక్షణం ప్రజల కోసం తపిస్తూ, నమ్ముకున్న ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సురేఖమ్మ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ కార్యనిర్వా హక కార్యదర్శి ఎండి ముజాహిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్దం జనార్దన్, సీనియర్ జిల్లా నాయకులు సర్వోజీ, యువజన కాంగ్రెస్ నాయకులు నరేందర్, రంజిత్, నవీన్, కిరణ్, సతీష్, సురేష్, అనిరుడ్, సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు పాల్గొన్నారు.



# ఘనంగా డీసీసీ అధ్యక్షురాలు జన్మదిన వేడుకలు

**లక్షెట్టిపేట, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

మున్సిపాలిటీ లోని స్థానిక ఐబీ గెస్ట్ హౌస్ లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ- ప్రేమ్ సాగర్ రావు పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు



మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షురాలుగా సురేఖమ్మ పార్టీపై నిబద్ధతను, ప్రజల పట్ల ఉన్న సేవ తపనను నాయకులు ప్రశంసించారు. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా బలోపేతం అయిందని, సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆమె మంచిర్యాల జిల్లాకే ఉక్కు మహిళగా, పేదల పెన్నిధి అని తెలిపారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మండల అధ్యక్షులు పింగళి రమేష్,మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమేల రాజు పలు వార్డ్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు సింగరేణిలో 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం

**మందమర్రి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల మెరుగుదల వంటి అంశాలపై సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్ బలరామ్ శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు "డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల కార్మికులు పాల్గొనవచ్చని, సింగరేణి సంస్థ



ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల పెంపుదలకు నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా పంచుకోవచ్చని, ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 040-23311338 నెంబర్ కు కాల్ చేయాల్సి ఉంటుందని సింగరేణి అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉత్తమ ఉద్యోగికి గుర్తింపు

**లక్షెట్టిపేట, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

ఉద్యోగులు వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తేనే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని విద్యుత్ జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ జాడే ఉత్తం పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సర్కిల్ పరిధిలో ఇటీవల ఉత్తమ ఏడీఈ గా ప్రభాకర్ రావు, ఉత్తమ ఏఈ గా గణేష్ ను రాష్ట్ర సీఎండి వరుణ్ రెడ్డి ఎంపిక చేశారు. దీంతో వీరిద్దరిని శుక్రవారం స్థానిక ఈ ఆర్వో కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డి ఈ కైసర్, ఎస్ ఏ ఓ రాజేశం,ఏఏఓ సుధాకర్, జన్నారం ఏ ఈ లచన్న, దండేపల్లి ఏ ఈ బాపు, డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయి
## -మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్
# పోలీసుల ఆధ్వర్యంలో చలి దుప్పట్ల పంపిణీ

**నెన్నెల, నవంబర్ 21 సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కర్జి గ్రామంలో బెల్లంపల్లి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో శు క్రవారం 150 మంది ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి




ముఖ్య అతిథిగా హాజరైన మంచి ర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ ఐపీఎస్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడంలో మానసిక ప్రశాంతత, ఆనందం కలుగు తుందని ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల పోలీసులకు ప్రజలకు మధ్య సంబంధాలు బంధా లుగా మారుతాయన్నారు. పోలీసులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇతర దేశమైన అమెరికా ఉన్నప్పటికీ మారుమూల ప్రాంతంలో సేవ చేయడానికి ముందుకు వచ్చిన గుడిమల్ల మమతను ఈ సందర్భ ంగా అభినం దించారు. ఈ కార్య క్రమానికి బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, బెల్లంపల్లి రూరల్ సిఐ సిహెచ్ హనోక్, స్థానిక ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.



# అప్పుడే పుట్టిన బాబుపై హాస్పిటల్ లోనే ర్యాక్ పడి మృతి
## –ఆసుపత్రి నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

**నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్..**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని సంతోష్ రాజ్ చిన్నపిల్లల ఆసుపత్రిలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల అప్పుడే పుట్టిన బాబు మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. వివరాలిలా ఉన్నాయి. సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామానికి చెందిన మచ్చర్ల రాజమణి, సాయిరాం దంపతులకు శు క్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని విద్యా హాస్పిటల్లో పండంటి బాబు




జన్మించాడు. అనంతరం బాబుకు చికిత్స నిమిత్తం నిర్మల్ పట్టణంలోని సంతోష్ రాజ్ చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చారు. బాబుకి చికిత్స అందిస్తున్న తరుణంలోనే ఒక్కసారిగా గోడకు అమర్చిన కప్ బోర్డ్ హఠాత్తుగా కూలి చిన్నారి బాబుపై పడింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో వైద్య బృందం బాబుని ఐసియు కు తరలించి చికిత్స జరిపారు.ఐతే బాబు అప్పటికే మృతి చెందాడు. నెలల తరబడి మోసి కన్నబిడ్డ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారు ఆసుపత్రిలో రోదిస్తున్న తీరు పలువురికి కంట తడి తెప్పించింది.కాగా బాబు మృతి విషయమై సదరు ఆసుపత్రి వైద్యుడు తల్లిదండ్రులతో రాజీ కుదుర్చుకునేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం.







సూర్య
www.suryaa.com
శనివారం 22 నవంబర్ 2025

## ఎనోలి కొలాంగూడలో దుప్పట్లు పంపిణీ
# రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి

**వాంకిడి నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్.**

మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామ సమస్యలపై చర్చించారు. ఈ



సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పీఎం జన్మన్ పథకంలో గ్రామానికి 19 ఇండ్లు మంజూరు అయినప్పటికీ ఆటవి అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుమ్ర ఈశ్వరిబాయి రాజు ఫౌండేషన్ ద్వారా గ్రామంలోని 20 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొలం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం జలపతి, చౌపనూడ మాజీ సర్పంచ్ సిడం అన్నిగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, విటిడిఏ వైస్ ప్రెసిడెంట్ సిడం పగ్గు, నాయకులు కుంరం లింగు, ఆత్రం తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ జ్ఞాపకార్థంగా దుప్పట్లు
# పంపిణీ చేసిన కుమారుడు అల్లూరి రాజు

**పెంచికల్ పేట్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

పెంచికల్ పేట్ మండలంలోని అగర్ గూడ గ్రామానికి చెందిన అల్లూరి రాజు తన అమ్మ అల్లూరి అంకుబాయి జ్ఞాపకార్థంగా నిరుపేద కుటుంబాలకు



చెందిన వృద్ధులకు చలి దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అమ్మ జ్ఞాపకార్థంగా నిరుపేదలు చలినుంచి వెచ్చదనాన్ని అందించడంతో పాటు అమ్మ పట్ల ప్రేమను, గౌరవాన్ని చాటడానికి ఈ సహాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, నిరుపేదలు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు రెండు రోజుల అవగాహన

**రెబ్బెన, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

డిజిటల్ సర్టిఫికేట్ కాంపెయిన్ 4.0 కార్యక్రమం లో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు రెండు రోజుల పాటు గోలేటి జిఎం కార్యాలయంలో సిపిఎంఎఫ్, సిపిఆర్ఎంఎస్ రినివల్ చేసుకోవడం పై అవగాహన కల్పించనున్నట్లు జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇప్పటివరకు విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్ రినివల్ కోసం జీవన్ ప్రమాన్ , వైద్యసేవల కోసం హెల్త్ కార్డు రినివల్ ను మీసేవ కేంద్రాల్లో మాత్రమే చేసుకుంటున్నారు. కాగా ఇప్పటినుండి మీసేవా కేంద్రాల్లో మాత్రమే కాకుండా ఇంట్లో తమ ఫోన్ లోనే రినివల్ చేసుకోవడం పై ఈ నెల 24, 25 వ తేదీలో సిపిఎంఎఫ్ , సింగరేణి అధికారులు అవగాహన కల్పించనున్నారు. కావున విశ్రాంత సింగరేణి ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఏడాది ఇంటివద్దనే సిపిఎంఎఫ్, సిపిఆర్ఎంఎస్ రినివల్ చేసుకోవడం నేర్చుకోవాలని ఆయన కోరారు. అవగాహన కార్యక్రమానికి వచ్చే వారు ఆధార్, జీవన్ ప్రమాన్, సిపిఆర్ఎంఎస్ ప్రతులను తమవెంట తీసుకురావాలని జి ఎం కోరారు.

# తిర్యాని పోచమ్మ గుడిని దర్శించుకున్న
## జిల్లా కాంగ్రెస్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్
### ఆలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి వినతి పత్రం

**తిర్యాని (నవంబర్ 21, 2025) సూర్య మేజర్ న్యూస్:**

జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ శుక్రవారం రోజున తిర్యాని గ్రామంలో కొలువై ఉన్న మహిమానితమైన పోచమ్మ గుడిని దర్శించుకుని. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం, గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామస్తులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం, హనుమాన్ మందిర్ మరియు శ్రీరామాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే రేకుల షెడ్ నిర్మాణ పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీనివాస్ గౌడ్, మడావి శ్రీరాములు, దౌలత్ రావు, బొజ్జి రావు, జగదీష్, రాజేష్, సురేష్, ఆత్రం గోపి, అన్నం వెంకటేష్, జుగునాక మారుతి, నాగపురి కరుణాకర్ గౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చే 42 శాతం బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించిన బీసీ జేఏసీ

## -బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలి
## -బీసీ సంఘాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం
## -బీసీ జేఏసీ జిల్లా కో-ఆర్డినేటర్ వడ్డేపల్లి మనోహర్

**మందమర్రి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్.**

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే కాంగ్రెస్ పార్టీని బీసీ ప్రజలు నమ్మరని, బిసి రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా కో-ఆర్డినేటర్ ఒడ్డేపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా జేఏసీ నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా కో-ఆర్డినేటర్ వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ బీసీ సంఘాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, బిసి రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక ఎన్నికలకు వెళితే కాంగ్రెస్ పార్టీని బీసీ ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించేందుకు డిసెంబర్ 1 నుండి జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించాలని, ఇందు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లాలన్నారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరపున పార్లమెంటు సమావేశాలను స్తంభింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి పార్ల మెంట్ లో బీసీ బిల్లు పై చర్చ చేపట్టి రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలపాలని, లేని పక్షంలో డిసెంబర్ మొదటి వారంలో వేలాది మందితో పార్లమెంటును దిగ్బంధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలు వెళితే బీసీలు రాష్ట్రంలో అగ్గి రాజేస్తారనీ, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్కల వలె బీసీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై దండెత్తుతారని హెచ్చరించారు. ఢిల్లీ తో కాంగ్రెస్ పోరాడితే దేశంలోని బీసీల అండ కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని, బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయకుండా తప్పించుకుంటున్న బిజెపిని బీసీల దోషిగా చేసే బాధ్యత బీసీ సమాజం తీసుకుంటుందన్నారు. బీసీ ప్రధానిగా నరేంద్ర మోడీ గత 11 సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్నప్పటికీ బీసీల డిమాండ్లను ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. బిజెపికి బీసీల పై చిత్తశుద్ధి ఉంటే డిసెంబరులో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంపై పోరాడకుండా స్థానిక ఎన్నికలు వెళ్తే బీసీలకు కాంగ్రెస్ దోషిగా మిగులుతుందని, బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదనీ, తెలంగాణ ఉద్యమం, ఢిల్లీ రైతు ఉద్యమాల తరహాలో బీసీలు ఉద్యమించి విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండీళ్ల శ్రీనివాస్, బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా మీడియా ఇంచార్జి కట్కోజుల రమణా చారి, బీసీ సంఘం నాయకులు పోలు శ్రీనివాస్, తడిగొప్పుల రవి రాజా, బేర వేణుగోపాల్, మద్ది వేణుగోపాల్ గౌడ్, ఎండి ఖలీల్, యోగా నందరావు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన గెజిటెడ్
# అధికారుల సంఘం నాయకులు

**నిర్మల్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్**

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా "జల సంచయ్-జన భాగీదారి"అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా గెజిటెడ్ అధికారుల అధ్యక్షుడు డాక్టర్ పి జి రెడ్డి, జిల్లా కార్యదర్శి ధాత్రిక



రమేష్ మరియు కార్యవర్గ సభ్యులు కలెక్టర్ ను కలసి అభినందనలు చెప్పారు. జాతీయ స్థాయిలో దక్షిణాది విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలిచి కోటి రూపాయల రివార్డు పొందడం గర్వకారణమని టీజీఓ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఈ విజయంలో అధికారుల కృషి, ప్రజల భాగస్వామ్యం ఉందని కలెక్టర్ తెలిపారు. టీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పీజీ రెడ్డి,జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్ మరియు కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు.

# మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

**లక్షెట్టిపేట, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్ :**

మండలంలోని జెండా వెంకటపూర్ గ్రామానికి చెందిన బండారి రామలక్ష్మి(95) అనే వృద్ధురాలు బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు వయస్సు పై బడటం తో ఇబ్బంది పడుతూ గత కొద్దిరోజులుగా తరచు కుటుంబీకులకు చెబుతూ ఇంకా తనకు చావు రావడం లేదు అని బాధపడేది. ఇంట్లో వాళ్ళు ఓదార్చిన తన ప్రవర్తన అలాగే అంటూ ఉండేది వృద్ధాప్యం పై పడటంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

# నస్పూర్ మండలంలో చెకుముకి టాలెంట్ టెస్ట్

**నస్పూర్, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను, నస్పూర్ లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్లో నిర్వహించినారు. జన విజ్ఞాన వేదిక, జిల్లా గౌరవ అధ్యక్షులు బత్తిని దేవన్న, నస్పూర్ మండల విద్యాధికారి ఈ పద్మజ చెకుముకి ప్రశ్న పత్రం కవర్ ఓపెన్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా బత్తిని దేవన్న మాట్లాడుతూ, గత 36



సంవత్సరాలుగా నిరంతరంగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తూ, వారికి తోడుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు,అందించిన సహకారంతో జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడానికి, సైన్సు ప్రావీణ్యతను పెంచడానికి, సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి, దోహదపడుతుందని అన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి ఈనెల నవంబర్ 28వ తేదీన జిల్లాలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉంటుందని అన్నారు. అనంతరం మండల విద్యాధికారి పద్మజ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని, పెంపొందించడానికి, సమాజంలో వున్న మూఢనమ్మకాలు, నిర్మూలించడానికి ఇట్టి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అని అన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్ లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్టిన్ గ్రామర్ హై స్కూల్ వ్యవస్థాపకురాలు సబియా సుల్తానా, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ఉపేందర్, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగి కుటుంబీకులకు చెక్కు అందజేత

**బెల్లంపల్లి, నవంబర్ 21, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణి ఉద్యోగం చేస్తూ ఇటీవలె మృతిచెందిన ఈపీ ఆపరేటర్ వీర్ల శ్రీధర్ కుటుంభీకులకు ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్ శుక్రవారం రోజున భీమా చెక్కును అందజేశారు. అందులో జిఐఎస్ చెక్కు రూ" ఒక లక్ష ఇరవై ఐదు వేలతో పాటు ఏంఏంసి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, మేనేజర్ శంకర్, సంక్షేమ అధికారి రజిని కుమార్, ఏఐటియుసి నాయకుడు రాయిని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

